


మోసాలపై ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన 'సంచార్‌సాథీ' యాప్ ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉంది. ఇది తప్పనిసరి అని కేంద్రం తన ఆదేశాల్లో పేర్కొనడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఈ విమర్శల వేళ.. ప్రీ ఇన్‌స్టాల్ యాప్‌ను డిలీట్ చేసుకోవచ్చని కేంద్రం వెల్లడించింది. అసలు ఇంతకీ ఈ యాప్ ఎలా పనిచేస్తుందంటే..? సంచార్ సాథీ యాప్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయిన తర్వాత ఐఎంఈఐ నంబర్.. సీఈఐఆర్‌తో అనుసంధానం అవుతుంది. ఐఎంఈఐ అనేది ప్రతి మొబైల్‌కు ప్రత్యేకంగా ఉండే 15 అంకెల ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ నంబర్. CEIR ఒక కేంద్రీకృత డేటాబేస్. చట్టబద్ధంగా తీసుకున్న ప్రతి మొబైల్ వివరాలు ఇక్కడ రికార్డ్ అయి ఉంటాయి. ఫోన్ పోయినా, దొంగతనానికి గురైనా.. ఈ యాప్ ద్వారా బ్లాక్ చేసేలా రిక్వెస్ట్ చేయవచ్చు.

తర్వాత సంబంధిత మొబైల్ ఐఎంఈఐ ఎక్కడా పనిచేయకుండా అన్ని నెట్‌వర్క్‌లను సీఈఐఆర్ అలర్ట్ చేస్తుంది. దాంతో సిమ్ మార్చినా ఫోన్‌తో ఉపయోగం లేకుండాపోతుంది. కాగా.. IMEI నంబరును ట్యాంపరింగ్ చేస్తే మూడేళ్ల వరకు జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా.. రెండు శిక్షలూ విధించేలా టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023ను రూపొందించారు.

**సంచార్ సాథీ ఫీచర్లు ఇవే..** అనుమానిత కాల్స్/ ఎస్సెమ్మెస్‌లు వచ్చినప్పుడు కాల్ లాగ్ నుంచే నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. మీ పేరు మీద ఎన్ని మొబైల్ కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవచ్చు. మీ పేరు మీద అనధికారికంగా ఏవైనా నంబర్లు ఉంటే ఫిర్యాదు చేయొచ్చు. మొబైల్ పోయినప్పుడు, దొంగతనానికి గురైనప్పుడు బ్లాక్ చేసే సదుపాయం ఇందులో ఉంది. మొబైల్ ఫోన్ ప్రామాణికతను కూడా యాప్ సాయంతో గుర్తించొచ్చు. ఇందుకోసం ఐఎంఈఐ నంబర్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. సెకండ్ హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేసేటప్పుడు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

జనవరిలో కేంద్ర ప్రభుత్వం సంచార్ సాథీ యాప్‌ను విడుదల చేసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ఈ యాప్‌ను వాడటం ద్వారా ఇప్పటివరకు 7 లక్షలకు పైగా పోయిన ఫోన్లు రికవరీ అయ్యాయి. దొంగతనానికి గురైన 3.7 లక్షల ఫోన్లను బ్లాక్ చేశారు. 30 మిలియన్ల మోసపూరిత కనెక్షన్లను తొలగించారు.




ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే అయిదు, పదేళ్లలో అణుయుద్ధం జరగొచ్చని పేర్కొన్నారు. ఎక్స్‌లో ఓ యూజర్ పోస్టుకు సమాధానంగా మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. హంటర్ యాష్ అనే ఓ యూజర్ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టాడు. 'అణ్వాయుధాలు ప్రధాన శక్తుల మధ్య యుద్ధాన్ని, యుద్ధ ముప్పును నిరోధిస్తాయని ఇప్పుడు ఉన్న ప్రభుత్వాలు పిచ్చిగా నమ్ముతున్నాయి. కాబట్టి.. ఆ ప్రభుత్వాలపై బయటి శక్తుల నుంచి ఎలాంటి ఒత్తిడి ఉండదు' అని రాసుకొచ్చాడు. దీనికి ఎలాన్ మస్క్ బదులిస్తూ యుద్ధం కచ్చితంగా జరుగుతుందని పేర్కొన్నారు. 'యుద్ధం అనివార్యం. 5, 10ఏళ్లలో ఇది జరుగుతుంది' అని రాసుకొచ్చారు. అయితే, తన వ్యాఖ్యలపై మస్క్ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటుచేసిన డోజ్ శాఖలో పనిచేసిన మస్క్.. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఇక, యుద్ధం జరగబోతోందంటూ మస్క్ చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొందరు యూజర్లు గ్రోక్‌ను అడిగారు. దీనికి అది బదులిస్తూ.. ఎలాన్ మస్క్ తన పోస్టుకు సంబంధించి ఎలాంటి వివరాలు వెల్లడించలేదని తెలిపింది. అయితే, గతంలో ఆయన చేసిన ప్రకటన ఆధారంగా.. సామూహిక వలసలు, రాజకీయ కారణాల వల్ల యూరప్-యూకేలోని అంతర్యుద్ధం జరగొచ్చని మస్క్ హెచ్చరించినట్లు తెలిపింది. దీంతోపాటు తైవాన్ విషయంలో యూఎస్- చైనా, ఉక్రెయిన్‌లోని ఘర్షణలు మూడో ప్రపంచయుద్ధంగా మారిందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు గురించి ప్రస్తావించింది.




## సంచార్ సాథీని డిలీట్ చేసుకోవచ్చు: విమర్శల వేళ వెనక్కి తగ్గిన కేంద్రం

భారత్‌లో విక్రయించే అన్ని మొబైళ్లలో ప్రభుత్వం రూపొందించిన సైబర్ సెక్యూరిటీ యాప్ సంచార్ సాథీని డిఫాల్ట్‌గా అందించాలని కేంద్రం మొబైల్ తయారీ సంస్థలను ఆదేశించింది. దీనిపై సోమవారం రాత్రి పీఐబీ ప్రెస్‌నోట్‌ను విడుదల చేసింది. ఈ ఆదేశాల అమలుకు 90 రోజుల గడువు ఇచ్చిన కేంద్రం.. దానికి సంబంధించి 120 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రెస్‌నోట్‌లో స్పష్టం చేసింది. దీనిపై విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం కేంద్రం వెనక్కి తగ్గింది. ఇది తప్పనిసరి కాదని వెల్లడించింది. ఆ యాప్‌ను డిలీట్ చేసుకోవచ్చని చెప్పింది. ఫోన్‌లో సంచార్‌సాథీ యాప్ ప్రీ ఇన్‌స్టాల్ అయి ఉండాలి. ఫోన్ వాడకాన్ని ప్రారంభించినప్పటి నుంచి, ఈ యాప్ పనిచేయాలి. ఫోన్ నుంచి ఈ యాప్‌ను తొలగించే వీలుండకూడదని కేంద్రం తన ఆదేశాల్లో పేర్కొంది. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశాయి. దేశాన్ని నియంతృత్వం వైపు తీసుకెళ్తున్నారని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ దుయ్యబట్టారు. ఫోన్లపై నిఘానో, సంచార్ సాథీ యాప్ విషయమో కాదు.. అన్ని అంశాల్లో వారి వైఖరి అలాగే ఉందని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. "ఇది పెగాసస్ ప్లస్‌ప్లస్. బిగ్ బ్రదర్ మన ఫోన్‌ను, మొత్తం మన ప్రైవేటు జీవితాన్ని స్వాధీనం చేసుకుంటాడు" అని కాంగ్రెస్ నేత కార్తి చిదంబరం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విపక్షాలు పార్లమెంట్ సమావేశాలకు అంతరాయం సృష్టించొద్దని, అన్ని అంశాలపైనా చర్చించేందుకు సిద్ధమని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆ విమర్శలను తోసిపుచ్చారు. కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పందించారు. ఆ యాప్‌ను వాడాలనుకోకపోతే.. మొబైల్ ఫోన్ వినియోగదారులు దానిని తొలగించే ఆప్షన్ ఉందని వెల్లడించారు. "మీరు దానిని కొనసాగించాలని అనుకుంటే.. మీ ఫోన్‌లో ఉంచుకోవచ్చు. డిలీట్ చేయాలనుకుంటే చేసేయొచ్చు. మీరు ఫోన్ కొనుగోలు చేసినప్పుడు ఎన్నో యాప్‌లు ముందుగానే ఇన్‌స్టాల్ అయి ఉంటాయి. అవి వద్దనుకుంటే తొలగించుకుంటాం కదా.

ఇది యూజర్ల రక్షణకు సంబంధించిన అంశం. ఇందులో తప్పనిసరి ఏమీ లేదు. మీరు రిజిస్టర్ కాకపోతే.. అది అచేతనంగా ఉండిపోతుంది. డిలీట్ కూడా చేసుకోవచ్చు. అయితే మోసం నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఒక యాప్ ఉందని ప్రతిఒక్కరికీ తెలియదు. కాబట్టి ఆ సమాచారాన్ని వెల్లడి చేయడం ప్రభుత్వ బాధ్యత" అని మంత్రి వెల్లడించారు. ఫోన్ తయారీదారులకు ఆదేశాలు జారీ చేయడం వెనకగల కారణం ఇదేనన్న ఉద్దేశంలో మీడియాకు సమాధానం ఇచ్చారు.

# శ్రీలంకకు పాకిస్థాన్ మోసపూరిత సహాయం... పిక్స్ వైరల్!




దిత్వా తుపానుతో శ్రీలంక గజగజలాడుతోన్న సంగతి తెలిసిందే. ఈ తుపాను ధాటికి వరదలు వెల్లువెత్తగా, పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ క్రమంలో ఈ తుపాను బీభత్సానికి ఇప్పటివరకూ సుమారు 400 మంది వరకూ ప్రాణాలు కొల్పోగా, పలువురు గల్లంతయ్యారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఈ సమయంలో పలు దేశాలు శ్రీలంకకు బాసటగా నిలిచాయి, సహాయం చేస్తున్నాయి. ఇందులో భాగంగా... శ్రీలంకను ఆదుకునేందుకు ఇప్పటికే భారత్ రంగంలోకి దిగింది. "ఆపరేషన్ సాగర్ బంధు" పేరుతో సహాయక చర్యలు చేపడుతోంది. మరోవైపు శ్రీలంకకు సాయం చేయడానికి వెళ్తామంటే... పాకిస్థాన్ కోసం పహల్గాం ఉగ్రదాడి సమయంలో మూసేసిన గగనతలానికి గంటల వ్యవధిలో అనుమతిచ్చి సహకరించింది. అయితే శ్రీలంకకు పాక్ చేసిన సాయం ఇప్పుడు నెట్టింట ట్రోలింగ్ కు బలైంది! అవును... వరదలతో అతలాకుతలమైన శ్రీలంకతో సంఘీభావం ప్రకటించడానికి పాకిస్థాన్ ఓ ప్రయత్నం చేసింది. ఇందులో భాగంగా పలు ఆహార పదార్థాలను కొలొంబోకు పంపింది. దీనికి సంబంధించిన పలు ఫోటోలను పాకిస్థాన్ హైకమిషన్ స్వయంగా పంచుకొంది.

అయితే.. ఇప్పుడు ఆ ఫోటోలపై నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. అందులో ప్యాకెట్స్ పై ఎక్స్ పైరీ డేట్ సుమారు ఏడాది క్రితంగా ఉంది. ఇందులో భాగంగా... శ్రీలంకకు పాకిస్థాన్ సాయం అంటూ పంపించిన ప్యాకెట్స్ లేబుల్స్ పై "ఈ.ఎక్స్.పీ:10/2024" అని ఉంది. దీంతో.. ఇటీవల కాలంలో అత్యంత దారుణమైన సంక్షోభాలతో పోరాడుతున్న దేశానికి పాకిస్థాన్ ఇలా గడువు ముగిసిన ఉత్పత్తులను రవాణా చేసిందంటూ నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. సహాయం చేయకపోయినా పర్లేదు కానీ.. ఇలా మోస పూరిత సహాయం చేయకూడదని అంటున్నారు. ఈ సందర్భంగా పాక్ హైకమిషన్ పోస్ట్ చేసిన ఫోటోలలోని ప్యాకెట్లపై ఉన్న "ఈ.ఎక్స్.పీ." ని మార్క్ చేసి రీపోస్టులు, షేర్లు చేస్తున్నారు నెటిజన్లు. ఇదే సమయంలో.. విపత్తు బాధితులను పాకిస్థాన్ అగౌరవపరుస్తోందని.. వారికి గడువు ముగిసిన వస్తువులను పంపడం ఏమాత్రం సరైంది కాదని అంటున్నారు. అయితే... దీనిపై ఆ దేశం నుంచి ఇంకా వివరణ రాలేదు! పాక్ (మోసపు) సాయం సంగతి అలా ఉంటే... మరోవైపు శ్రీలంకకు మద్దతు ఇవ్వడానికి భారత్ భారీ మానవతా కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా... ఆపరేషన్ సాగర్ బంధులో భాగంగా వాయు, సముద్ర మార్గాల ద్వారా ఇప్పటివరకూ సుమారు 53 టన్నుల సహాయ సామాగ్రిని పంపిణీ చేసింది. అదేవిధంగా.. శ్రీలంకలో చిక్కుకున్న 2,000 మందికి పైగా భారతీయులను తరలించినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. కొసమెరుపు: ఆ ఫోటోలతో పాకిస్థాన్ అభాసుపాలైన నేపథ్యంలో... శ్రీలంకలోని పాక్ హైకమీషన్ ఆ పోస్టును తొలగించింది! మరో పోస్టులో వైట్ పాలిథీన్ కవర్స్ లో వస్తువులను ఉంచి అందిస్తున్నట్లు ఉన్న ఫోటోలను షేర్ చేసింది.

## 'కండోమ్'లపై పన్ను.. ఎక్కడ? ఎందుకు?

అవాంఛిత గర్భాలను నిరోధించేందుకు దుష్ప్రభావాలు చూపని ఏకైక సాధనం.. కండోమ్ వినియోగం. ప్రపంచ వ్యాప్తగా పలు దేశాల్లో కండోమ్ వినియోగం 2015తో పోల్చితే.. 2025నాటికి 80 శాతం మేరకు పెరిగింది. భారత్‌లో కండోమ్‌లను అత్యధికంగా వినియోగిస్తున్న నగరం.. అందరూ అనుకున్నట్టుగా ముంబై కాదు... ఇండోర్(మధ్యప్రదేశ్.) తర్వాత స్థానంలో హైదరాబాద్ ఉందని ఇటీవలే గణాంకాలు వెల్లడయ్యాయి. ఇక.. మూడోస్థానంలో ముంబై ఉంది. ఇదిలావుంటే.. కండోమ్‌ల వినియోగాన్ని ఒకప్పుడు తప్పుగా, సిగ్గుగా భావించేవారు. కానీ, రానురాను కండోమ్‌లు చిల్లర దుకాణాల్లోనూ విక్రయిస్తున్న విషయం తెలిసిందే. మన దేశం విషయానికి వస్తే.. కండోమల్‌పై ఎలాంటి నియంత్రణా, పన్నులు కూడా లేవు. విదేశీ తయారీ కండోమ్‌లపై మాత్రమే పన్ను ఉంది. స్వదేశీ తయారీ కండోమ్‌లపై స్థానిక సెస్సులు మినహా.. మన దగ్గర ఎలాంటి పన్నులు విధించడం లేదు. ఎయిడ్స్ నివారణలో భాగంగా.. 1995లో తీసుకున్న నిర్ణయమే నేటికీ అమలు అవుతోంది. అయితే.. తాజాగా మన పొరుగు దేశం చైనాలో కండోమ్‌లపై పన్ను విధిస్తున్నారు. దీనికి సంబంధించి



షి.జిన్‌పింగ్ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కండోమ్‌లపై 13 శాతం పన్నును విధిస్తున్నట్టు పేర్కొంది. ఇలా కండోమ్‌లపై పన్ను విధించడం చైనాలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.

**రీజనేంటి?...** కేవలం కండోమ్‌లపైనే కాకుండా.. గర్భనిరోధక మాత్రలు, ఔషధాలపై కూడా.. పన్నులు విధిస్తూ..చైనా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి ప్రధానంగా చైనా చెబుతున్న రీజన్.. దేశంలో జనాభా రేటును పెంచడమే. ఇటీవలకాలంలో దేశంలో వివిధ కారణాలతో.. పురుషులు, మహిళలు కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. దీంతో కుటుంబంలో ఎవరూ పిల్లల సంరక్షణ చర్యలు తీసుకునేందుకు అందుబాటులో లేకుండా పోయారు. ఈ నేపథ్యంలో పిల్లలు వద్దనుకునే దంపతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇది వ్యక్తిగత విషయమేనని అనుకున్నా.. చైనా జాతీయ స్థాయిలో జననాల రేటు తగ్గి.. భవిష్యత్తులో జనాభా అత్యల్ప స్థాయికి పడిపోయే ప్రమాదం ఏర్పడింది. దీనివల్ల దేశ జీడీపీ కూడా తగ్గిపోతుంది. ఇది ఆర్థికవ్యవస్థపైనా.. ప్రపంచంలో చైనా దక్కించుకున్న స్థానంపైనా ప్రభావం చూపనుంది. ఈ నేపథ్యంలోనే చైనా గత ఏడాది అక్టోబరులోనే పిల్లలను కనండి.. పేరుతో కీలక పథకాలను ప్రకటించింది. ప్రజా రవాణాను ఉచితం చేసింది. మాతృత్వ, గర్భిణీ సెలవులను రెట్టింపు చేసింది. ప్రభుత్వ పథకాలతోపాటు.. విద్యుత్తు, మొబైల్ బిల్లులను కూడా మహిళలకు(పిల్లల్ని కనేవారికి) ఉచితం చేసింది. ఇలా.. అనేక ప్రోత్సాహకాలు ప్రకటించింది. అయినా.. జననాల రేటు పెరగకపోగా.. కండోమ్‌ల వినియోగం భారీ స్థాయిలో పెరిగింది. దీంతో ఇప్పుడు కండోమ్‌లపై నియంత్రణ కోసం.. పన్నులు విధించింది. మరి ఇప్పటికైనా చైనా ప్రజలు పిల్లల్ని కనే విషయంలో మనసు మార్చుకుంటారో లేదో చూడాలి.

## బిగ్ అలర్ట్... లక్ష పైన సీసీ కెమెరాలు హ్యాక్.. ఫుటేజ్ తో ఏమి చేస్తున్నారంటే..!

ఈ రోజుల్లో సైబర్ నేరాలు విచ్చలవిడిగా పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. అవసరాల కోసం ఫోన్ వాడితే దాని నుంచి సైబర్ నేరం, డబ్బులు ఆన్ లైన్ ట్రాన్స్ ఫర్ చేస్తే అటు నుంచి మోసం.. ఇక ఆఖరికి సెక్యూరిటీ నిమిత్తం ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు పెట్టుకున్నా వాటినీ హ్యాక్ చేస్తున్న పరిస్థితి. ఈ క్రమంలో ఇలాంటి పనికి పూనుకున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అవును... దక్షిణ కొరియాలో ఇళ్లు, వ్యాపార స్థలాల్లోని సుమారు 1, 20,000కి పైగా సీసీ కెమెరాలను హ్యాక్ చేసి, ఆ ఫుటేజీని ఉపయోగించి విదేశీ వెబ్ సైట్ కోసం లైంగిక దోపిడీ విషయాలను తయారు చేశారనే ఆరోపణలపై నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఫుటేజీల నుంచి వీరు వందల సంఖ్యలో లైంగిక దోపిడీ వీడియోలు తయారు చేశారని చెబుతున్నారు. ఈ సందర్భంగా నిందితులు సాధారణ పాస్ వర్డ్ వంటి ఇంటర్నెట్ ప్రోటోకాల్ దుర్భలత్వాన్ని ఉపయోగించుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా దేశంలో హ్యాక్ చేయబడిన కెమెరాల ప్రదేశాలలో ప్రైవేట్ హౌస్ లు, హోటల్స్, స్టూడియోలు, గైనకాలజిస్ట్ క్లీనిక్ లు ఉన్నాయని చెబుతున్నారు. అయితే



తాజాగా అరెస్ట్ అయిన నలుగురిలో ఒకరికిఒకరు సంబంధం లేని వ్యక్తులని వెల్లడించారు. ఈ క్రమంలో అరెస్ట్ కాబడినవారిలో ఒకరు సుమారు 63,000 కెమెరాలను హ్యాక్ చేశారని.. ఈ క్రమంలో వాటి నుంచి 545 లైంగిక దోపిడీ వీడియోలను తయారు చేసాడని.. వాటిని సుమారు 35 మిలియన్ వోన్ లకు అమ్మేశాడని పోలీసులు తెలిపారు. మరో వ్యక్తి 70,000 కెమెరాలు హ్యాక్ చేసి, వాటిద్వారా 648 వీడియోలు చేసి వాటిని 18 మిలియన్ వోన్ లకు విక్రయించారని తెలిపారు! ఈ సందర్భంగా స్పందించిన నేషనల్ పోలీస్ ఏజెన్సీ లో సైబర్ ఇన్వెస్టిగేషన్ చీఫ్ పార్క్ వూ హ్యాన్... ఈ ఫుటేజీని చట్టవిరుద్ధంగా పంపిణీ చేసిన వెబ్ సైట్ లో గత ఏడాది పోస్ట్ చేయబడిన సుమారు 62% వీడియోలకు ఈ ఇద్దరూ బాధ్యులని తెలిపారు. ఆ వెబ్ సైట్ ను మూసివేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. దాని ఆపరేటర్ ను దర్యాప్తు చేయడానికి పలు విదేశీ ఏజెన్సీలు సహకరిస్తున్నాయని అన్నారు. ఇదే సమయంలో... ప్రధానంగా ఇళ్లల్లో, వ్యాపార ప్రాంగణాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నవారు అప్రమత్తంగా ఉండాలని.. వాటికి సంబంధించిన యాక్సెస్ పాస్ వర్డ్ లను రెగ్యులర్ గా మారుస్తూ ఉండాలని నేషనల్ పోలీస్ ఏజెన్సీ తన ప్రకటనలో తెలిపింది.

